క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జరజాపు రంగారావు, ఎంపీటీసీ సున్నా నరేష్, గుండుగొలను రిటైర్డ్ గ్రంథాలయ అధికారి బెజవాడ ప్రసాద్ అన్నారు. ఉంద్రాజవరం కమ్యూనిటీ హాల్లో రామేన పైడారావు ప్రభావతి జ్ఞాపకార్థం, శ్రీనివాస మెడికల్ షాపు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ వైద్యాధికారి హరికృష్ణ, గైనకాలజీ వైద్యాధికారి గీతిక వైద్య సిబ్బందితో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఉంద్రాజవరం పోతునూరు, దోసపాడు, కేదవరం, గుండుగొలను, కొవ్వలితో పాటు సమీప గ్రామాల్లో ప్రజలు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

యంత్రాలతో కోతలు ప్రారంభం



యంత్రాలతో కోతలు కోస్తున్న రైతులు

దెందులూరు: మండలంలో యంత్రాలతో వరి కోతలు ప్రారంభమయ్యాయి. దాదాపు 7,432 ఎకరాల్లో సాగు చేయగా అధికంగా పీఆర్ 126, 1121 విత్తనాలను రైతులు సాగు చేశారు. ఎండలు, ఇతర కారణాలవల్ల కూలీలు కొరతతో రైతులు యంత్రాలను ఆశ్రయించక తప్పలేదు. తుపాను ప్రకటనల నేపథ్యంలో త్వరితగతిన కోతలను పూర్తిచేసేందుకు రైతులు యంత్రాలపైనే మక్కువ చూపిస్తున్నారు. కోసిన ధాన్యాన్ని రోడ్లపై పోయగా.. తుపాను హెచ్చరికలు, చిరుజల్లులు పడుతున్న నేపథ్యంలో బరకాలతో ధాన్యాన్ని కప్పుకుంటున్నారు. దేవుడు కరుణించి వర్షాలు రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

సగర్ల సంఘం యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా రమణ



గాది వెంకటరమణ

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నాయకుడు గాది వెంకటరమణ సగర్ల సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఏలూరులో శనివారం జరిగిన సంఘ జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు తాడిశెట్టి గోపిరావు నియామకపు పత్రాన్ని అందచేసి అభినందించారని వెంకటరమణ విలేకర్లకు తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.సురేష్ బాబు, రాష్ట్ర సగర్ల యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్కా వీర వెంకటేశ్వరరావు, రాష్ట్ర సగర్ల సంఘం న్యాయ విభాగం కార్యదర్శి గండికోట సీతారామరాజు, ధనుకొండ శేఖర్ తదితర నాయకులు గాది వెంకటరమణను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

భీమడోలు: పూళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ లైన్లకు మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు వల్ల సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏలూరు డివిజన్ విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఈఈ కేఎం అంబేద్కర్ ఆదివారం తెలిపారు. పూళ్ల, ఎంఎంపురం, కురెళ్లగూడెం, దుద్దేపూడి, అదే విధంగా 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న బాలబాలికలు

ఏలూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 7 గంటలకు ఏలూరులో ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ చేపట్టారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు శారీరక శ్రమ అవసరమన్నారు. ఇందుకోసం క్రీడలు, వ్యాయామం, నడక, పరుగు, సైక్లింగ్, స్విమ్మింగ్, యోగా సాధన చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఫిట్ ఇండియా పేరుతో ప్రజల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్విమ్మింగ్ నేషనల్ మెడలిస్ట్ బలగా స్వామి జెండా ఊపడంతో క్రీడాకారులు అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి బయలదేరి నగరంలో ర్యాలీ నిర్వహించారు. సాయ్ సెంటర్ ఇన్‌చార్జి వినాయక్ ప్రసాద్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎం.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో వార్షిక పరీక్షలు

- 6 - 9వ తరగతులకు 7వ తేదీ నుంచి
- 1 - 5వ తరగతులకు 9వ తేదీ నుంచి
- సీబీఏ విధానంలో పరీక్షల నిర్వహణ
- గంట ముందు మాత్రమే ప్రశ్నాపత్రాల సరఫరా
- 21న విద్యార్థులకు ప్రగతి పత్రాల పంపిణీ



నిడమర్రులో ఓఎంఆర్ షీట్లు పంపిణీకి సిద్ధం చేస్తున్న సీఆర్పీలు



గణపవరంలో పరీక్షల మెటీరియల్ సిద్ధం చేస్తున్న ఎంఈవో కార్యాలయ సిబ్బంది

నిడమర్రు: ప్రతి పాఠశాలల్లో విద్యాసంవత్సరం ముగింపులో నిర్వహించే వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆయా మండల ఎంఈవోలు తెలిపారు. ఇప్పటికే ఓఎంఆర్ షీట్స్, ప్రశ్నాపత్రాలు సంబంధిత మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలకు చేరుకున్నాయి. వీటిని పాఠశాలల వారీగా పంపిణీ చేసేందుకు ఎంఈవో కార్యాలయాల సిబ్బంది ఆదివారం సిద్ధం చేశారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకూ ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కటే ప్రశ్నాపత్రంతో సంగ్రహాణాత్మక మూల్యాకనం (ఎస్ఏ)-2ను క్లాస్‌రూం బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ)-3 విధానంలో నిర్వహించనున్నారు. 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు, 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ 1 నుంచి 5వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను పబ్లిక్ పరీక్షల మాదిరిగా పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 1 నుంచి 9వ తరగతి చదువుతున్న 27,350 మంది ఈ పరీక్షలకు హాజరు కానున్నారు.

1వ తరగతికీ ఓఎంఆర్ షీట్స్‌తోనే

1వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ ఓఎంఆర్ షీట్స్ విధానంలోనే ఈ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4 యూనిట్ (ఎఫ్ఏ) పరీక్షల్లో 3 సెల్ఫ్ అసెస్మెంట్ టెర్మ్ పరీక్షలుగానూ ఒక యూనిట్ (ఎఫ్ఏ) పరీక్షను క్లాస్‌రూం బేస్డ్ అసెస్మెంట్‌గా (సీబీఏ) నిర్వహించారు. ఇప్పటికే ఎస్ఏ-1ని సీబీఏ విధానంలో నిర్వహించారు. ఈ పరీక్షలను సీబీఏ-3గా ఓఎంఆర్ షీట్స్ విధానంలో విద్యార్థులు రాయాల్సి ఉంది.

టైమ్ టేబుల్ ఇలా..

6నుంచి 9తరగతుల విద్యార్థులకు 7వతేదీన తెలుగు, 8న ఇంగ్లీషు, 9న హిందీ, 10న గణితం, 11న జనరల్ సైన్స్/భౌతిక శాస్త్రం, 12న జీవశాస్త్రం, 15న సోషల్, 16, 17న కాంపోజిట్ కోర్సుల పేపర్-1, 2 పరీక్షలుఉంటాయి. 1నుంచి 5తరగతులకు 9వ తేదీన తెలుగు, 10న ఇంగ్లీష్, 11న గణితం, 12న పరిసరాల విజ్ఞానం పరీక్షలు ఉదయం పూట నిర్వహించనున్నారు. జిల్లా కామన్ ఎగ్జామ్‌బోర్డు నుంచి ఓఎంఆర్ పత్రాలు, ప్రశ్నాపత్రాలు అందాయి. ఆదివారం వీటిని పాఠశాలల వారీగా తరగతి వారీగా బండిల్స్ కట్టే పనిలో సీఆర్పీలు నిమగ్నమయ్యారు.

ఏరోజు ప్రశ్నాపత్రం ఆరోజే

ప్రతి రోజు పరీక్షల ప్రారంభం గంటల ముందు సంబంధిత బండిళ్లను సీఆర్పీల ద్వారా పాఠశాలలకు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 6 నుంచి 9వ తరగతి వరకూఉన్న ప్రశ్నాపత్రాలు ఎంఈవో కార్యాలయం వద్ద, 1 నుంచి 5వ తరగతి వరకూ ప్రశ్నాపత్రాలు క్లస్టర్ కాంప్లెక్స్‌ల వద్ద భద్రపరిచేలా చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక స్కూల్స్ వారు క్లస్టర్ కన్వీనర్ నుంచి, ఉన్నత తరగతుల వారు ఎంఈవోల వద్ద నుంచి పంపిణీ జరుగుతోంది. హెచ్ఎంల ఆధ్వర్యంలో పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడమే కాకుండా మూల్యాకనం పాఠశాల స్థాయిలోనే జరపాల్సి ఉంది. మూల్యాకనం అనంతరం విద్యార్థి ప్రగతి పత్రాల్లో (హోలిస్టిక్ కార్డులు) నమోదు చేసి విద్యార్థులకు ఈనెల 22వ తేదీ లోపే అందించాల్సి ఉంది. వార్షిక పరీక్షల అనంతరం ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 12 వరకూ పాఠశాలలకు వేసవి సెలవులు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.

20వ తేదీలోపే ఆన్‌లైన్‌లో నమోదు



సీబీఏ-3కి సంబంధించిన మార్కులు ఈనెల 20వ తేదీలోపు సబ్జెక్టుల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేయాలి. 1 నుంచి 5వ తరగతి వరకూ 50 మార్కులకు, 6 నుంచి 8 తరగతులకు 80 మార్కులకు, 9వ తరగతికి 100 మార్కులకు వార్షిక పరీక్షలు జరుగుతాయి. పరీక్షల అనంతరం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతి చర్చించి 21వ తేదీన ప్రగతి పత్రాలు అందించాలి. – ఏపీఎస్ఎస్ భాస్కరకుమార్, ఎంఈవో-2, నిడమర్రు

ధ్యానంతో ప్రయోజనాలు అనేకం



ధ్యానం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: ధ్యానం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ధ్యానంపై దృష్టి సారించి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. భీమడోలులో ఆదివారం ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు జి.అప్పన్న అధ్యక్షత వహించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం వల్ల సత్య సాక్షాత్కారం, స్వీయ సాక్షాత్కారం పెంపొందడం ద్వారా ఆరోగ్యవంతులవుతారన్నారు. జీవిత దృక్పథాన్ని మార్చుకునేందుకు చక్కని మార్గమన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరిగి శారీర రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఒత్తిడి, కోపం, క్లిష్ట పరిస్థితులు తదితర వాటిపై పట్టు సాధిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ శాఖాహారాన్ని తినాలని, మాంసహారాన్ని విడనాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రాంబాబు, పంట్ల రామారావు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

నిడమర్రు: మద్యం అక్రమంగా నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వీర ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అడవికొలనులో దాడులు నిర్వహించగా కేతా వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో నిల్వ చేసిన 180 ఎంఎల్ బాటిళ్లు 20 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అంగరంగ వైభవం.. సీతారాముల కల్యాణం




ఉంగుటూరు: పెండ్లికుమార్తెను పీటల మీదకు తీసుకువచ్చిన భక్తులు



దెందులూరు: స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణాన్ని వాడవాడలా అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నులారా రాములోరి కల్యాణాన్ని తిలకించి తరించారు. జై శ్రీరామ్ నామస్మరణతో రామాలయాలు మార్మోగాయి. మండలంలోని గుండుగొలను, పూళ్ల, భీమడోలు, సూరప్పగూడెం, ఎంఎంపురం, కొల్లేరు గ్రామాల్లో రాములోరి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గుండుగొలనులోని శ్రీసీతారామ స్వామి వారి కల్యాణం ఆలయ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భద్రాద్రిలో కల్యాణం నిర్వహించే శుభ గడియాల్లోనే ఇక్కడ కూడా కల్యాణోత్సవం జరపడం సంప్రదాయంగా కొనసాగుతుంది. స్వామి, అమ్మవార్ల శోభాయాత్ర ఘనంగా జరిగింది. యువత రంగులను ఒకరిపై ఒకరు జల్లుకుని సందడి చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణోత్సవంలో స్వామి, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలు పోశారు. పానకాలు, నివేదన, హారతులు పట్టి కల్యాణ తంతును పూర్తి చేశారు. పూళ్లలోని మండపాల వద్ద గరుడ వాహనంపై సీతారామస్వామి వార్ల కల్యాణాన్ని నిర్వహించారు. భీమడోలు రైల్వే స్టేషన్ వద్ద కోదండ రామాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణాన్ని నిర్వహించారు. స్టేషన్ రైటర్ డి.శ్రీనివాస్, లీలా పద్మజ దంపతులు 2.5 కేజీల వెండితో తయారీ చేసిన శ్రీసీతారామ స్వామి, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను బహూకరించారు. తొలుత భీమడోలు పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో ఎస్సై వై.సుధాకర్ దంపతులు, డి.శ్రీనివాస్ దంపతులు పీటలపై కూర్చున్ని కల్యాణం చేశారు. ఆలయాల వద్ద భక్తులకు విసినకర్రలను పంపిణీ చేశారు.



భీమడోలు: గుండుగొలనులో భక్తులకు మంగళసూత్రాలను చూపుతున్న అర్చకులు



భీమడోలు: పూళ్లలో గరుడ వాహనంపై కల్యాణం చేస్తున్న దృశ్యం



భీమడోలు: కోదండ రామాలయంలో వెండి విగ్రహాలను ఊరేగిస్తున్న దాతలు

కైకరం కళింగ రామాలయంలో...

ఉంగుటూరు: కైకరం తూర్పువీధిలోని కళింగ రామాలయంలో సీతారాముల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ముత్తైదువులు పసుపు కొట్టారు. ఆతరువాత సీతమ్మ తల్లిని పెండ్లి కుమార్తెగా, రాములవారిని పెండ్లి కుమారుడిగా తీర్చిదిద్దారు. అనంతరం వేదిక మీదకు తీసుకువచ్చి స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కూనా అప్పారావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గీతామృతవాహిని సత్సంగం అధ్యక్షుడు కొచ్చర్లకోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు శ్రీరామ నామ లేఖనం పోటీలు జరిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి

దెందులూరు: శ్రీరామనవమి వేడుకలు గ్రామగ్రామాన భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పురాతన విశిష్టత గల సానిగూడెం రామాలయంలో మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ యలమర్తి పద్మజ మూడు కుటుంబాల దంపతులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్దేశించిన ముహూర్తానికి ఆలయ అర్చకులు కల్యాణం జరిపారు. అనంతరం భక్తులకు పానకం ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

వైభవంగా నవమి ఉత్సవాలు

గణపవరం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం గణపవరంలో ప్రసిద్ధ వేదపాఠశాల, తితిదే కల్యాణమండపం ఆవరణలోని పురాతన రామాలయం వద్ద గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో 105వ వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఉగాది రోజున ప్రారంభమైన ఉత్సవాలు శ్రీరామనవమి వరకూ ఘనంగా జరిపారు. చివరిరోజైన ఆదివారం ఉదయం శ్రీరాముని జన్మదినోత్సవం, సాయంత్రం సీతారాముల కల్యాణం నిర్వహించారు. మూడువేల మంది భక్తులు పాల్గొని సీతారాముల కల్యాణం తిలకించారు. బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సరిపల్లె రామాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. గణపవరం బస్టాండు వద్ద ఉన్న రామాలయంవద్ద ఆలయ చైర్మన్ సలాది భీమరాజు ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

తోటగూడెంలో వేడుకలు

పెదపాడు: తోటగూడెంలో శ్రీసీతారామాలయంలో స్వామివారి కల్యాణం ఆలయ ట్రస్టీ నూలు నర్సింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ గరికపాటి పాండురంగారావు, తిరుమల వీరయ్య, పెద్దిరెడ్డి రమేష్, నూలు కిశోర్, కాట్రం సురేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రామచంద్రపురం, గండిచెరువుగట్టు, దక్షిణవీధి, తూర్పువీధి, పాటిమీద రామాలయాల్లో పూజలు నిర్వహించారు. దక్షిణ వీధి రామాలయం వద్ద అన్నదానం నిర్వహించారు.



ఉంగుటూరు: విద్యార్థులకు శ్రీరామనామలేఖనం పోటీలు



పెదపాడు: స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న భక్తులు



భీమడోలు: భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

దేవుని మార్గంలో నడుచుకోవాలి



సువార్త సభల్లో దివ్యపూజబలిని సమర్పిస్తున్న ఫాదర్ బాబు జార్జ్, పక్కనే షింటో థామస్ తదితరులు

భీమడోలు: క్రైస్తవులంతా దేవునికి ఇష్టులుగా జీవించాలని, ఆయన మార్గంలో నడుచుకుంటూ పరిపూర్ణ విశ్వాసులుగా ఎదగాలని ఏలూరు మేత్రాసనం ఛాన్స్‌లర్ ఫాదర్ బాబు జార్జ్ అన్నారు. భీమడోలు ఆర్సీఎం చర్చినందు 38వ సజీవధారల సువార్త కూడికలు పేరిట ఆరోగ్య మాత మహోత్సవాలు శనివారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ కర్త ఫాదర్ షింటో థామస్ ఆధ్వర్యంలో గురువుల జ్యోతి ప్రజ్వలన చేశారు. బాబు జార్జ్ దివ్య పూజాబలిని అర్పించారు. విశ్వాసులను ఉద్దేశ్యించి వాక్యోపదేశాన్ని అందించారు. కర్నూలు సీనాయి ధ్యాన కేంద్రం అజిష్ దివ్యప్రసాద స్తుతి ఆరాధనను నడిపించారు. కుటుంబమంతా దేవుని పట్ల మంచిగా నడుచుకోవాలని, తద్వారా జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. అనంతరం మోకాళ్లపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో విచారణ కర్త ఫాదర్ షింటో థామస్, డీపాల్ ఫాదర్ నెల్సన్, పంగిడిగూడెం విచారణ కర్త టోనీ, బీడీఎస్ డైరెక్టర్ జింటో, జోసఫ్, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



ఎంఎంపురంలో రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని పూళ్ల, ఎంఎంపురం గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.1.20 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. అదేవిధంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.2.4 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డును ఆయన పరిశీలించారు. సర్పంచ్ దాయం సుజాత, వట్టి పవన్, పుప్పాల హరీష్, పుప్పాల శ్రీనివాసరావు, నోచర్ల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

కామవరపుకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేసినట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. నిందితుల నుంచి 8 కోడి పుంజులు, రూ.18,250 నగదు స్వాధీనపరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై చెన్నారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి, ఎం.నాగులపల్లి గ్రామాల్లో కోడిపందేల స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 14 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 13,600 నగదు, 4 కోడి పుంజులు, 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

చింతలపూడి: మండలంలోని ప్రగడవరం గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై చింతలపూడి ఎస్సై కుటుంబరావు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5గురిని అరెస్ట్ చేసి వారి నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, రూ.2,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండ్‌కు నోచుకోని కొల్లేరు ముఖద్వారం

ఉంగుటూరు: కొల్లేరు ముఖద్వారంగా ఉన్న నారా యణపురంలో బస్టాండు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం, ఉండి, పాలకోడేరు, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల కు చెందిన గ్రామాల ప్రజలు నారాయణపురం సెంటరుకు చేరుకుని ఇక్కడనుంచి జాతీయ రహదారి మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నారు. అయితే ఇక్కడ బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఏలూరు, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులకు బస్టాండ్ లేకపోవడంతో అక్కడే ఉన్న అంగళ్లు ముందు ప్రయాణికులు నిలబడాల్సిన పరిస్థితి. కాగా తాడేపల్లిగూడెం, రావులపాలెం వైపు వెళ్లే ప్రయాణికులకు చిన్న బస్ షెల్టర్ ఉంది. పట్టుమని పదిమంది కూర్చునేంత సదుపాయంకూడా లేదు. దీనికితోడు ఆ బస్ షెల్టర్ కూడా సరైన నిర్వహణ లేకపోవడంతో చెత్తాచెదారం పెరిగిపోయి అధ్వానంగా ఉంది. దీంతో ఈ ప్రయాణికులు సైతం రోడ్డుపైనే బస్సులు కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి. డెల్టాలోని 150 గ్రామాలకు చెందిన ప్రజలు నారాయణపురం సెంటరు నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇక్కడ బస్టాండ్, మంచినీటి వసతి, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొల్లేరు ప్రాంత గ్రామాలకు, డెల్టా గ్రామాలకు ముఖద్వారంగా ఉన్న నారాయణపురం సెంటర్లో ఇరువైపులా బస్టాండ్‌లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నారాయణపురంలో బస్టాండు లేక రోడ్డు మీద ప్రయాణికులు నిలబడే ప్రదేశం ఇదే